## క్లుప్తంగా

### మిత్రుడికి చేయూత..



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

తల్లాడ: అనారోగ్యానికి గురై పేదరికంతో ఇబ్బందిపడుతున్న వ్యక్తికి తోటి మిత్రులు చేయూత అందించి, ధైర్యాన్ని నింపారు. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన జి.వెంకట్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా అతనితో తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సేకరించిన రూ.51,500లను గురువారం వెంకట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారి పిల్లల హాస్పటల్ వైద్యులు కేవీ.కృష్ణారావు, కృష్ణ, సరికొండ అప్పల్‌రాజు, ఉపాధ్యాయులు రహీం, కానిస్టేబుల్ అక్బర్, మిట్టపల్లి నరసింహారావు, కృష్ణకుమారి, కళావతి, అనిత, ఎం.ప్రతాప్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

వైరా: విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొంది వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచే వారే నిజమైన ఉపాధ్యాయులుగా మిగిలిపోతారని వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరావు అన్నారు. పాఠశాలలో పని చేసి పదోన్నతి పొందిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు రామకృష్ణ, మాధవరావు, తులిశమ్మ, దొడ్డా వరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, సీతారామారావు, పద్మావతి, నీలవేణి, అనిత, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

ముదిగొండ: మండలపరిధిలోని ఖానాపురంలో సూర్యచంద్ర ఫ్రార్మర్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేస్ ఆస్పత్రి వైద్యులు 90 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి సందర్శించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మురళి, వైద్యులు పాల్గొన్నారు.

### వితరణ



సామగ్రి అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొణిజర్ల: మండలంలోని చిన్నమునగాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, చేయూత ట్రస్ట్ చైర్మన్ పాపగంటి జయరాజు, సభ్యులు పాపగంటి యోబు, రవి, మాజీ సర్పంచ్ కాంపెల్లి స్వప్న, ఉపాధ్యాయులు జమలయ్య, చినబాబు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

**ఆదివాసీలకు దుస్తులు..**



దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం ఊటవాగు వద్ద గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వలస ఆదివాసీలకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ ప్రతినిధి కొంగర రామచంద్రరావు, దొడ్డ సీతారామయ్య, కొంగర పురుషోత్తం, చంద్రకాని నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నివాళి..

బోనకల్: మండలంలోని కలకోట, రాయన్నపేటలో నాయకులు తూము ప్రకాశరావు వర్ధంతి గురువారం నిర్వహించగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, తూము సుశీలమ్మ, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు, సభ్యులు నీరజ, సీపీఐఎల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు తూము రోషన్ కుమార్, బొమ్మనేని హనుమంతరావు, యంగల ఎలేష్ , పూర్ణచందర్రావు, మరిదు ఈశ్వరమ్మ, ఆనందరావు, వీరభద్రం, మాతంగి శ్రీనివాసరావు, ఉజ్వల చరణ్ పాల్గొన్నారు.

# బిల్లుల కోసం నిరీక్షణ..

**మధ్యాహ్న భోజన కార్మికులకు తప్పని తిప్పలు**

- మూడు నెలలుగా నిలిచిపోయిన బిల్లులు, వేతనాలు
- వడ్డీలకు తెచ్చి మరీ వంటావార్పు
- అప్పుల పాలవుతున్న కార్మికులు



ఏన్కూరులో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఏన్కూరు: మధ్యాహ్న భోజన బిల్లులు, వేతనాల కోసం కార్మికులు నిరీక్షిస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు, బిల్లుల నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనం నిర్వహణ భారంగా మారింది. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 49 ఉండగా, వీటిలో 74 మంది మధ్యాహ్న భోజన వర్కర్లు పనిచేస్తున్నారు. వీరికి కిరణా సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లకు కలిపి నెలకు సుమారు రూ.2.50 లక్షలు బిల్లులు వస్తాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలలు కలిపి రూ.7.50 లక్షలు రావాలి. 74 మందికి వర్కర్లకు నెలకు రూ.3,000 వేతనం చొప్పున మూడు నెలలకు కలిపి రూ.6 లక్షల 66 వేలు రావాలి. ఇప్పటి వరకు వేతనాలు, బిల్లులు అందకపోవడంతో కార్మికులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. కూరగాయలు, కిరణా దుకాణంలో అప్పులు పెరిగిపోతున్నాయి. వడ్డీలకు తెచ్చి వంట సరుకులు తీసుకురావడంతో అప్పుల వారి వేధింపులు మొదలయ్యాయని కార్మికులు వాపోతున్నారు. డిసెంబర్ నుంచి కోడిగుడ్ల బిల్లులు పడలేదని, ప్రస్తుతం గుడ్డు ధర పెరగడంతో పరిస్థితి దారుణంగా ఉందంటున్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యి 15 రోజులు కావస్తున్నప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని, దీంతో నిర్వహణ భారం అవుతుందంటున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసి వేతనాలు సకాలంలో అందించాలని భోజన కార్మికులు కోరుతున్నారు.

**వడ్డీ భారం పడుతోంది..**



మూడు నెలలుగా బిల్లులు, వేతనం రాలేదు. అప్పులు తీసుకువచ్చి భోజనం పెడుతున్నాం. బిల్లులు రాకపోవడంతో కిరణాదుకాణం యాజమానులు అప్పులు ఇవ్వడం లేదు. వడ్డీలకు తెచ్చి వంట వండుతున్నాం. డిసెంబర్ నుంచి కోడిగుడ్డు బిల్లులు ఇవ్వలేదు.

– చిలుకూరి నిర్మల, భోజన వర్కర్, ఏన్కూరు

# విద్యతోనే సమాజంలో మార్పు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మధిర: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, అంతరాలు తొలగిపోతాయని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. రాయపట్నం ప్రధానోపాధ్యాయురాలు ఎం.కస్తూరిబాయి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక రెడ్డి గార్డెన్స్ కళ్యాణ్ మండపంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి కస్తూరిబాయి అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి అంతరాలు లేని విద్య అందరికీ అందించాలని కోరారు. విద్య ర్యాంకుల కోసం కాదని, మంచి సమాజాన్ని నిర్మించడానికన్నారు. విద్యా రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.ప్రభాకర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, వల్లంకొండ రాంబాబు, ఆంజనేయులు, వీరబాబు, నాగేశ్వరరావు, మీరాఖాన్, సాంబయ్య, వినోద్ రావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేశవరెడ్డి, బద్రుద్దీన్

సత్తుపల్లి: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బుద్రుద్దీన్ తెలిపారు. సత్తుపల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం త్రిసభ్యకమిటీ సభ్యులకు సమస్యలపై వినతిపత్రం అందించిందన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని, లేనట్‌లైతే జులై నెల నుంచి దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

### కాలనీల్లో పరిశీలించిన తహసీల్దార్

వేంసూరు: మండల పరిధిలోని యర్రగుంటపాడు యానాదుల కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎంఏ రాజు తెలిపారు. కాలనీలో ఉన్న సమస్యలపై సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ వినతిపత్రం అందించగా గురువారం తహసీల్దార్ కాలనీని పరిశీలించారు. కాలనీ వాసులతో డ్రైయినేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నారావు, అంజమ్మ, రంజాన్‌బి, లాల్‌మహ్మద్, సుజాత, అర్జున్‌రావు పాల్గొన్నారు.

### యువజన సర్వే



యువకులతో రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్

తల్లాడ: మండలకేంద్రంలో గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సర్వే నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల వ్యాప్తంగా గ్రామాల్లో యువజన సర్వే చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, విక్రమ్, కిరణ్, శివ, సైదులు పాల్గొన్నారు.

### బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణపై పోరాడాలి

సత్తుపల్లిటౌన్: తెలంగాణలో బొగ్గుబ్లాక్‌లను వేలం వేయకుండా సింగరేణి సంస్థలకు అప్పగించాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఇప్పటికే అనేక కార్మికుల కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎ.వెంకన్న, నాయకులు పుల్లయ్య, శరత్, సూరిబాబు, సత్యం, విశ్వనాథం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జి.రామయ్య

# బాబా ఆలయాల్లో పూజలు



ఎర్రుపాలెం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో బాబా వారికి గురువారం అర్చకులు పూజలు, అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో నల్లుల హర్షనిత్విక్, తూనుగుండ్ల రామకృష్ణ, పెరుగు నాగరాజులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి తదితరులున్నారు.



కల్లూరురూరల్: అన్నదాన కార్యక్రమం..

కల్లూరురూరల్: కల్లూరులోని శ్రీ షిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో అర్చకులు ఎలమంచిలి మధుసూదనశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మందిర ప్రధాన కార్యదర్శి కొప్పురపు బలరాం, కార్యవర్గ సభ్యులు గుగులోతు బావాజీ, గార్లపాటి శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీహరి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఉన్నత లక్ష్యాన్ని సాధించండి



విద్యార్థిని సన్మానిస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సత్తుపల్లి శ్రీనారాయణ జూనియర్ కళాశాల చైర్మన్ ఎన్‌సీహెచ్ రామకృష్ణమాచార్యులు అన్నారు. ఇంటర్ ఇంప్రూమెంట్ ఫలితాల్లో కళాశాలకు చెందిన నల్లాన్ చక్రవర్తుల శ్రీసఖవరుణ్ ఎంపీసీ విభాగంలో 470/467 మార్కులు సాధించి స్టేట్‌టాపర్‌గా నిలిచిన సందర్భంగా గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వనమారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజాకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు నరకుమార్, మోహన్‌రావు, నాగరాజు, రాగం శ్రీను, రాజశేఖర్, సుజీర్ పాల్గొన్నారు.

### మూడు ఉద్యోగాలకు ఎంపికైన లక్ష్మి



లక్ష్మి

చింతకాని: చింతకాని ఎమ్మార్వో కాలనీకి చెందిన మరకాల లక్ష్మి గురుకులాల్లోని మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. కొన్నాళ్ల క్రితం వెలువడిన ఫలితాల్లో ఆమె పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించింది. వీటితో పాటు తాజాగా లైబ్రేరియన్ పోస్టుకు సైతం ఎంపికైనట్లు సమాచారం అందిందని లక్ష్మి వెల్లడించింది. ప్రస్తుతం ఆమె మండలంలోని లచ్చగూడెం కేజీబీవీలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, భర్త, అత్తమామల ప్రోత్సాహంతో ఉద్యోగాలు సాధించానని తెలిపారు.

### పరామర్శ..

కల్లూరు: కల్లూరుకు చెందిన కో ఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ అధికారి గంగుల పుల్లయ్య ఇటీవల మృతి చెందగా గురువారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పుల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దబోయిన దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు కొండూరు కిరణ్‌కుమార్, మాదిరాజు లక్ష్మణరావు, నాయకులు ఎస్‌కే.అఫ్రోజ్, సంపత్, చోటో, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### విరిగిన విద్యుత్ స్తంభం

మధిర: మధిర పట్టణంలోని సిద్దారెడ్డి బజార్‌లో గురువారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెత్త సేకరణకు వెళ్లిన మున్సిపాలిటీ ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడం వల్ల విరిగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో వాహనదారులు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



విరిగిన విద్యుత్ స్తంభం

# సత్తుపల్లికి గోదావరి జలాలు తీసుకొస్తాం..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల తరలింపునకు చేపట్టిన ట్రయల్ ల్‌రన్ విజయవంతం కావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. ఎమ్మెల్యే గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాలో పారించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి చేస్తున్న ప్రయత్నాలు ఓ కొలిక్కి వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు సరైన నిధులు విడుదల చేయకపోవడం వల్ల జాప్యం జరిగిందని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వల్ల వేగం పెరిగిందని చెప్పారు. కాగా, యాతాలకుంట టన్నెల్ నిర్మాణానికి భూనిర్వాసితులకు రూ.10కోట్లు మొదటి విడతగా విడుదల చేసిన నేపథ్యానపనుల్లో పురోగతి వస్తుందన్నారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే బేతుపల్లి చెరువును గోదావరి జలాలతో నింపి సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు వచ్చే ఏడాదికల్లా లంకాసాగర్‌కు గోదావరి జలాలు చేరుస్తామని ఎమ్మెల్యే రాగమయి వెల్లడించారు. కాగా, జలయజ్ఞంలో పాలుపంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

- జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు



విద్యార్థులతో మాట్లాడుతున్న కమల్‌రాజ్

కల్లూరురూరల్: పాఠశాలలు ప్రారంభమైనందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ కోరారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను బోధన విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా పాఠశాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, పుసులూరి శ్రీనివాసరావు, ఎంఈఓ దామోదర ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ రాంబాబు పాల్గొన్నారు.

# మరమ్మతులకు నివేదిక పంపిస్తాం..

సాక్షి ఎఫెక్ట్..

వైరారూరల్: లిఫ్ట్ ఇరిగేషన్ షెడ్డు శిథిలావస్థకు చేరిందని గుర్తించామని, పాత విద్యుత్ మోటార్లు, పైపులైన్ల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఏఈ హరికృష్ణ రైతులకు తెలిపారు. మండలంలోని దాచాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను గురువారం నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఏళ్ల తరబడి నుండి పాత విద్యుత్ మోటార్లు, పాత పైపులైన్లతో రైతులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఏళ్లుగా ఇంతేనా' కథనానికి అధికారులు స్పందించి లిఫ్ట్ ఇరిగేష్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త విద్యుత్ మోటార్లు, కొత్త పైపులైన్లను ఏర్పాటు చేయడంతో ఆయకట్టు పెరిగే అవకాశం ఉందని చిన్న, సన్నకారు రైతులకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌నే ప్రత్యామ్నాయమని ఏఈని రైతులు కోరారు. సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు.



విద్యుత్ మోటార్లను పరిశీలిస్తున్న ఏఈ హరికృష్ణ

# మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

కారేపల్లి: మాదకద్రవ్యాల మత్తులో యువత భవిష్యత్ నాశనం అవుతుందని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎస్సై ఎస్.రాజారాం అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవంను పురస్కరించుకొని పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా కఠినచర్యలను తీసుకుంటామన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల జోలికి పోయి ,జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వసంత లక్ష్మి, జీజేసీ ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, కేజీబీవీ ఎస్ఓ ఝాన్సీసౌజన్య, వైద్యాధికారి సురేష్, సీహెచ్ఓ భద్రయ్య, సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, నాయకులు అడప పుల్లారావు, సిబ్బంది రమేష్, వెంకన్న, శంకర్, పార్థసారథి, జాన్‌పాషా, మోషాపాషా, మదార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఎంపీలపై దాడులను ఖండించాలి

ఎర్రుపాలెం: గ్రామీణ వైద్యులపై (ఆర్ఎంపీలు) జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని గ్రామీణ వైద్యుల జిల్లా కమిటీ అధ్యక్షులు బి కొండలరావు, మండల కమిటీ అధ్యక్షులు పుల్లారెడ్డిలు కోరారు. గురువారం మండలంలోని రాజుల దేవరపాడు గ్రామంలో గ్రామీణ వైద్యుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్ రామారావు, కార్యదర్శి ముజే, మండల కమిటీ సభ్యులు మేకల రమేష్ ,వేమిరెడ్డి బ్రహ్మారెడ్డి, పత్తిపాటి విజయ భాస్కర్, మొహంత్,భాస్కర్, తదితరులున్నారు.

### వైద్య సేవలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న మద్దోజు శ్రావణ్‌కుమార్

వైరా: పీహెచ్‌సీలను 30 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసి వైద్య సేవలు మెరుగు పరచాలని ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దోజు శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం భూక్యా సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రామారావు, ఆకాశ్ , సురేష్, నరేందర్, మహేష్, పల్లవి, కృష్ణ పాల్గొన్నారు.

**అటెన్షన్ ప్లీజ్**

### ఆర్వోబీపై నిలిచిన వర్షపు నీరు



మండలంలోని పెగళ్లపాడు ఆర్వోబీపై వర్షపు నీరు నిలుస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా భారీగా నీరు నిలవడంతో బ్రిడ్జి దెబ్బతిని, గుంతలు పడే ప్రమాదం ఉంది. అంతే కాకుండా పెద్ద వాహనాలు ప్రయాణించే సమయంలో ఆ పక్కనే ద్విచక్రవాహన చోదకులపై బురద నీరు పడటంతో ప్రయాణికులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు..

- ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఏఈ, ఆర్అండ్‌బీ
సెల్ నంబర్ : 9912340678

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642